దేశం గర్వించదగిన శాస్త్రవేత్త రామన్



కొత్తపేట డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు శేషగిరిరావు



అంబాజీపేట హైస్కూల్‌లో రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం

అంబాజీపేట: 1930లో నోబెల్ బహుమతి అందుకున్న మొట్టమొదటి భారత భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ అని హెచ్‌ఎం కడలి సాయిరామ్ అన్నారు. ప్రపంచ సైన్స్ దినోత్సవం సందర్భంగా అంబాజీపేట, తొండవరం, గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూలులో వైజ్ఞానిక ప్రదర్శనలను బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ 1986 నుంచి ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆయా హైస్కూళ్లలో వినూత్న రీతిలో విద్యార్థులు కిరణ రేఖా చిత్రాలు, వ్యోమగామి, సీవీ రామన్ చిత్రాలు, శిశు జననం, జీర్ణవ్యవస్థ, రక్త ప్రసరణ, ఆర్బిటాల్స్ మూలకాల ఆవర్తన పట్టిక తదితర ఆసక్తికర సైన్స్ చిత్రాలను వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక సిద్ధార్థ స్కూల్లో బుధవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు పలు రకాల విజ్ఞాన, వైద్యానిక ప్రదర్శనలు తయారు చేసి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ముల్లా రావు, ఏవో ప్రభాకర్ రెడ్డి ప్రిన్సిపాల్ ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: సైన్స్ డే సందర్భంగా మండల స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన సమావేశంలో ఎన్ఆర్ఐ నయినాల శ్రీనివాస్ రూ.21 వేల నగదు బహుమతులను అందించారు. హెచ్‌ఎం సీహెచ్ నిరంజని అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఎంఈఓ లక్ష్మీనారాయణ, కమిటీ చైర్మన్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మామిడికుదురు స్కూల్లో విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, డీవీవీ సత్యనారాయణ, యక్కల దేవర నాగన్నబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతికత వైపు విద్యార్థులు పయనించాలి

కొత్తపేట: శాస్త్ర, సాంకేతికతను అవగాహన చేసుకోవడం ద్వారా ఆ దిశగా పయనించాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే పెద్దిరాజు విద్యార్థులకు సూచించారు. సీవీ రామన్ 'రామన్ ఎఫెక్ట్' ను కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని జరుపుకొంటున్న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అండ్ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



మామిడికుదురులో విద్యార్థులు రూపొందించిన రాకెట్ నమూనా

విద్యార్థుల భవితకు 'సైన్స్' గొప్ప పునాది

అయినవిల్లి: విద్యార్థుల భవితకు 'సైన్స్ టెంపర్' గొప్ప పునాది అని సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. బుధవారం ముక్తేశ్వరం కోనసీమ విద్యాశ్రమ్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్‌వీవీ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా సర్వేశ్వరశర్మ ముఖ్యఅతిథిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సర్వేశ్వరశర్మ మాట్లాడుతూ పక్షపాతంగా వ్యవహరించకుండా ముందుగా ఏర్పరచుకున్న భావనలతో కాకుండా న్యాయపరంగా కారణాలను అన్వేషిస్తూ అనువర్తనాలపై దృష్టి కేంద్రీకరించే ధోరణిని 'సైన్స్ టెంపర్' అంటరన్నారు. ఈ ధోరణి అలవరచుకుంటే అది విద్యార్థుల భవితకు గొప్ప పునాది అవుతుందన్నారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపన్యాసాలు, క్విజ్‌లు, ఎగ్జి బిషన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.విశ్వమణి, ఎస్.భవాని తదితరులు ఉన్నారు. అలాగే ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరిపారు.

క్లుప్తంగా

యథాస్థానానికి చేరిన స్వామి వారి రథం



రథాన్ని షెడ్డుకు చేరుస్తున్న భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో బుధవారం రథం షెడ్డుకు లక్ష్మీనృసింహుని రథం చేరింది. క్షేత్రంలో స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు పూర్తయిన తరుణంలో 16 స్తంభాల మండపం వద్ద ఉన్న ఈ రథాన్ని ఆలయ అధికారుల పర్యవేక్షణలో పల్లిపాలెం అగ్నికుల క్షత్రియులు, వాహనకారులు, భక్తులు కలసి ఆలయం ప్రాంగణంలోని షెడ్డులోకి చేర్చారు. ఉత్సవాల్లో 16న రథసప్తమి రోజున రథాన్ని రథం షెడ్డు నుంచి మెరకవీధికి చేర్చారు. 20న స్వామివారి రథోత్సవం పూర్తయిన అనంతరం రథాన్ని 16 స్తంభాల మండపం వద్ద నిలుపుదల చేశారు.

శాస్త్రీయ పరిశోధనలపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ సీబీ సీఐడీ డీఎస్పీ సత్యనారాయణ

రాజోలు: విద్యార్థులు శాస్త్రీయ పరిశోధనలపై దృష్టి సారించాలని రిటైర్డ్ సీబీ సీఐడీ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. బుధవారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన జాతీయ సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పూర్వ విద్యార్థి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పట్టుదలతో విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, అధ్యాపకులు రాజ్‌కుమార్, శ్రీరామ్మూర్తి, శైలజ, షాహిని, భాస్కరరావు, ఎన్నారై పి.నాగరాజు, పీఆర్వో నల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

పక్షవాతం బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న అక్షయ సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: పక్షవాతంతో మంచాన పడిన బాధితుడికి స్థానిక అక్షయ సేవా సంస్థ సభ్యులు ఆర్థిక సాయం అందజేసినట్టు బుధవారం సంస్థ సభ్యులు తెలిపారు. ఆలమూరు మండలం మూలస్థానం గ్రామానికి చెందిన కోలా సోమయ్యకి రెండు సంవత్సరాల క్రితం పక్షవాతం వచ్చి కాళ్లు చేతులు పనిచేయడం లేదు. మంచం మీద నుంచి లేవలేని పరిస్థితి. జీవనాధారం లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వస్తున్న పింఛన్ పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సాయం చేయమని కోరడంతో రూ.14,500, 25 కేజీల బియ్యం బస్తా రూ.1500 కిరణా వస్తువులు అందజేసినట్టు తెలిపారు.

ప్రమాద భరితంగా విద్యుత్ ఫీజు బాక్స్



మాచవరంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ క్యారియర్ ఫీజు బాక్స్

అంబాజీపేట: మాచవరం భారతి కాన్వెంట్‌కు వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన ఫీజు క్యారియర్ బాక్స్ చేతి కందేంత ఎత్తులో ఉండటంతో ప్రమాద భరితంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రహదారిలో విద్యార్థులు, వృద్ధులు, మహిళలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ స్తంభానికి ఉన్న విద్యుత్ ఫీజు క్యారియర్ బాక్స్‌ను ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.

భారీ అన్న సమారాధన

పి.గన్నవరం: ముంగండ గ్రామంలో ముత్యాలమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం భక్తులకు భారీ అన్న సమారాధన చేశారు. అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. కార్యక్రమాలకు ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యం వహించారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం

మామిడికుదురు: స్థానిక వాసంశెట్టివారిపాలెం హైస్కూల్ రోడ్డులో నూతనంగా నిర్మించిన లక్ష్మీ గణపతి ఆలయం విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా బుధవారం సామూహిక లక్ష్మీగణపతి హోమం ఘనంగా జరిగింది. దీంతో పాటు కుంకుమార్చనలు, హోమం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, విశేష పూజ, గణపతి తాళం, వేద స్వస్తి తదితర పూజలను ఘనంగా జరిపించారు. వాసంశెట్టి సత్యనారాయణ మూర్తి, వెంకటరమాకాంత్‌బాబు, కవిత దంపతులతో ఈ పూజలను ఘనంగా జరిపించారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ జాయింట్ సెక్రటరీ వాసంశెట్టి సత్యనారాయణ మూర్తి, మట్టపర్తి త్రిమూర్తులు, గంగారత్నం దంపతులు, వాసంశెట్టి వెంకట్రావు, ఓలేటి సత్యం ఆధ్వర్యంలో వేద పండితుల పర్యవేక్షణలో ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఘనంగా వీరభద్రస్వామి మహోత్సవాలు...

పాశర్లపూడి ఉత్తరబాధవలో వీరభద్రస్వామి 71 వార్షికోత్సవ పూజలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7.35 గంటలకు స్వామి వారి ఉత్సవాలకు కలశ స్థాపన జరిగింది. కాశీభట్ల కామేశ్వరసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో మార్చి 3వ తేదీ వరకు అయిదు రోజులు పాటు స్వామి వారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.42,224 విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి తాడేపల్లి గూడేనికి చెందిన పి.అచ్యుత దివ్య రూ.42,224 విరాళం అందించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. దాతకు ఆలయ ఈఓ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

ఘనంగా పట్టాభిరామ స్వామి వార్షికోత్సవం

అంబాజీపేట: మాచవరం పంచాయతీ శివారు నందెపువారిపాలెంలో వేంచేసిన పట్టాభిరామ స్వామి 16వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి వార్షికోత్సవం సందర్భంగా గంధం వెంకటేశ్వరరావు, సుభాషిణి దంపతులతో కలస్థాపన చేసి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచి మహిళలు అభిషేకాలు, పుష్పాలంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకూ ఏకాహం నిర్వహించారు.

వివిధ గ్రామాల్లో సంకటహర చతుర్థి పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం సంకటహర చతుర్థి పూజలు వైభవంగా జరిగాయి. ఆయా గ్రామాల్లోని వినాయక ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చి వినాయకున్ని దర్శించుకున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకుని చింతలూరులో సంకటహర గణేశ యాగం నిర్వహించారు. పెదపళ్ళ బాలగణపతి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. సంకటహర చతుర్థి సందర్భంగా ఆయా ఆలయాల వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

ప్రజా క్షేత్రంలో ఎన్నికలకు సిద్ధం

జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి వేణుగోపాలరావు



అంబాజీపేటలో సిద్ధం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి వేణుగోపాలరావు

అంబాజీపేట: ప్రజా క్షేత్రంలో ఎన్నికలకు సిద్ధమవుదామని, బూత్ కమిటీల నాయకులు సైనికుల్లా పని చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారని జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. అంబాజీపేటలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు, జేసీఎస్ మండల కన్వీనర్లతో కరపత్రాలను విడుదల చేసి బుధవారం అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి వేణుగోపాలరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి ఏ విధంగా తీసుకువెళ్లి అందజేశామో అదే విధంగా ఎన్నికల్లో ప్రతి ఓటరును కలుసుకుని ఓటు వేసే విధంగా బూత్ కమిటీల ప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారన్నారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించి, మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వస్తే పథకాలన్నీ పొందే అవకాశం ఉందని ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పార్టీని గెలపించి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరాలన్నారు. కార్యక్రమంలో అంబాజీపేట, మామిడికుదురు, అయినవిల్లి, పి.గన్నవరం పార్టీ మండలాల అధ్యక్షులు విత్తనాల శేఖర్, కొమ్ముల కొండలరావు, కుడుపూడి విద్యాసాగర్, నక్కా వెంకటేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్లు దొమ్మేటి సత్యమోహన్, జక్కంపూడి వాసు, దొమ్మేటి దుర్గారావు, పులిదిండి ప్రభాకర్, నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, విప్పర్తి రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు ఉపశమనం

అంబాజీపేట: వైఎస్సార్ రైతు భరోసా కింద ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం రైతులకు పెద్ద ఊరటనిస్తోందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ రైతు విభాగం కార్యదర్శులు ఎంఎం శెట్టి, కొర్లపాటి కోటబాబులు అన్నారు. 2021-22 రబీ సీజన్, 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి బుధవారం వడ్డీ రాయితీ విడుదల చేసినట్లు మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకొని గడువులోపు చెల్లించిన రైతులకు 4 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందని ఏఓ విజయ్‌కుమార్ అన్నారు. అంబాజీపేట మండలానికి సంబంధించి 2021-22 రబీలో 803 మంది రైతులు రూ.12.74 లక్షలు, 2022 ఖరీఫ్‌లో 270 మంది రైతులకు, రూ.5.35 లక్షలు రాయితీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు విడుదల చేశారన్నారు. ఎంఎం శెట్టి, కోటబాబులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు రైతన్నలకు వ్యవసాయంపై ఆసక్తిని పెంచుతున్నాయన్నారు.

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

ఆలమూరు: బ్రహ్మాండ నాయకుడికి తన కుమారుడైన బ్రహ్మదేవుడు తొలిసారిగా చేయించిన ఉత్సవంగా బ్రహ్మోత్సవం అని ప్రతీతి. ఎక్కడ బ్రహ్మోత్సవాలు జరుగుతాయో అక్కడికి సకల దేవతలు విచ్చేసి వేంకటేశ్వర స్వామి వారిని సేవించుకుంటారని భక్తుల విశ్వాసం. కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి తొలి వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 29న గురువారం నుంచి ఆరంభమై ఐదు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఆలయ కమిటీ నేతృత్వంలో భక్తుల సహకారంతో ఐదు రోజుల పాటు తిరుమల తిరుపతి తరహాలో ఈ బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నిత్యఉత్తర ద్వార దర్శనం ఈ ఆలయ ప్రత్యేకత

ముక్కోటి ఏకాదశి రోజు వైకుంఠంలోని ఉత్తర ద్వారం వద్ద శ్రీహరి తన ఉభయదేవేరులతో దేవతలకు సాక్షాత్కరిస్తారు. దేవతలు, మునులు, యోగులు స్వామివారిని సేవించుకుని తరిస్తారు. వైష్ణవులే కాకుండా సకల భక్తులు శ్రీహరి ఉత్తర ద్వార దర్శనాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. వైకుంఠ ఏకాదశి మహా పర్వదినం రోజు ప్రతి వైష్ణవాలయం భూలోక వైకుంఠాన్ని తలపిస్తూ భక్తులతో కిటకిటలాడుతూ ఉంటుంది. మరి అంతటి ప్రాముఖ్యం ఉన్న ఉత్తర ద్వార దర్శన భాగ్యం భక్తులకు ప్రతి రోజు కలిగే క్షేత్రమే మండలంలోని చింతలూరులో ఉన్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రం. ఈ స్వామి వారిని ఇక్కడ ఎవరు ఎప్పుడు ప్రతిష్ఠించారో తెలియదు. ఉభయ తూర్పుగోదావరి జిల్లాల్లో ఎక్కడ కూడా లేని విధంగా ఈ క్షేత్రంలో స్వామి వారు ఉత్తర ముఖ సింహద్వారంలో భక్తులకు దర్శనమిస్తూ ఉంటారు. అత్యంత మనోహరంగా దర్శనమిచ్చే ఈ స్వామి వారి రూపాన్ని దర్శించి తరించాల్సిందే.



చింతలూరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి

పారదర్శకంగా ఉపాధి పనులు

సఖినేటిపల్లి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు పారదర్శకంగా చేపట్టాలని డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ ఆ శాఖ అధికారులు, సిబ్బందికి సూచించారు. పనుల్లో స్వల్ప లోపాలుంటే సరిదిద్దుకుని, మున్ముందు చేపట్టబోయే పనుల్లో పూర్తి పారదర్శకత తీసుకు రావాలని కూడా తెలిపారు. బుధవారం స్థానిక మండ పరిషత్ కార్యాలయంలో వద్ద ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకూ జరిగిన 780 పనులకు సంబంధించి మొత్తం రూ.7,06,22,488 ఖర్చు చేశారు. ఇందులో వేతనాల రూపంలో రూ.5,51,94,816, మెటీరియల్ రూపంలో రూ.1,54,27,672 వెచ్చించారు. ఆయా పనులపై గ్రామాల్లో విలేజ్ సోషల్ ఆడిటర్స్ తనిఖీలు జరిపి, నివేదికలు రూపొందించారు. సర్వే నివేదికలపై ప్రజావేదికలో పీడీ మధుసూదన్ గ్రామాల వారీగా సమీక్షించారు. స్వల్ప లోపాలు గుర్తించిన పనుల్లో భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా పలు సూచనలు చేశారు. అంబుడ్స్‌మన్ అడపా వెంకట శ్రీనివాస్, ఏపీవో నాగప్రసాద్, హెచ్‌ఆర్.సత్యనారాయణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో రివ్యూ చేస్తున్న పీడీ మధుసూదన్

టైలర్ల సమస్యల పరిష్కారానికి కృషి



పి.గన్నవరంలో టైలర్స్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు



మామిడికుదురులో విలియమ్స్ హోవే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టైలర్స్

పి.గన్నవరం: టైలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. పి.గన్నవరంలో శ్రీకోదండరామ మండల టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు తోలేటి సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటిగట్టు సెంటర్‌లో విలియమ్స్ హోవే చిత్ర పటానికి విప్పర్తి పూల మాలలు నివాళులు అర్పించారు. టైలర్స్ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. విప్పర్తి మాట్లాడారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, కొక్కిరి రవికుమార్, అడ్డగళ్ల శ్రీను, యూనియన్ నాయకులు సంసాని బ్రహ్మయ్య, తరపట్ల సింహాచలం, కొపనాతి రాము, తోలేటి నాగేశ్వరరావు, ముత్తా బత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు/మామిడికుదురు/సఖినేటిపల్లి/అంబాజీపేట/ఆలమూరు/కొత్తపేట: టైలర్స్ డే పురస్కరించుకుని కుట్టు మెషీన్ సృష్టికర్త విలియమ్స్ హోవే జయంతిని క్లస్టర్ పరిధిలోని పలుచోట్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. విలియం హో విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సఖినేటిపల్లిలో టైలర్స్ డేలో పాల్గొన్న సంఘ సభ్యులు



రాజోలులో హోవే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టైలర్స్ సంఘ నాయకులు



ఆలమూరులో విలియమ్స్ హోవే కు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టైలర్లు

దేవతామూర్తుల ఆశీస్సులతో అందరూ బాగుండాలి



వాడపాలెంలో గణపతి ఆలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: దేవతామూర్తుల అనుగ్రహం, ఆశీస్సులతో అందరూ బాగుండాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని వాడపాలెం మారెమ్మ మాన్యం ప్రాంతంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీగణపతి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యతిథిగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆ ప్రాంతీయులు ముఖ్యంగా మహిళలు మాట్లాడుతూ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చూపిన చొరవ, సహకారంతో ఆలయ నిర్మాణానికి ఏర్పడిన అడ్డంకులు తొలగాయని పేర్కొంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రజకుల బల్లల పండుగ

మండలంలోని వాడపాలెంలో రజకుల సత్తెమ్మ అమ్మవారి బల్లల పండగ, జాతర మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వాడపాలెంలో సత్తెమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆయన మాట్లాడుతూ అమ్మవారి కరుణా కటాక్షాలు అందరిపై ఉండాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, జిల్లా పార్టీ సభ్యుడు బండారు కృష్ణమూర్తి, మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మట్టా బాబ్జి, పార్టీ నాయకులు మిండిగుదిటి నాగన్న, కోరిమిల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.